క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అర్ధమండల దీక్షలు ప్రారంభం



భక్తులకు మాలధారణ చేస్తున్న పండితులు

ఆసిఫాబాద్అర్బన్: ఈనెల 23వ తేదీన హనుమాన్ జయంతి పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో 150 మంది హనుమాన్ భక్తులు అర్ధమండల దీక్షలను స్వీకరించారు. ఆలయంలో ఉదయం 5 గంటల నుంచి అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ, శేఖర్‌శర్మ, శ్రీనివాస్‌శర్మ, మహేశ్‌శర్మల ఆధ్వర్యంలో గణపతి పూజ, నవగ్రహపూజ, ఆంజనేయస్వామికి రుద్రాభిషేకం, అష్టోత్తర శతనామపూజ, అనంతరం దీక్షాపరులకు మాలధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు వివేక్, రమేశ్, శ్రీనివాస్, క్రుపాల్, మధు, సుధాకర్, నారాయణమూర్తి, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సర్వాయి పాపన్న వర్ధంతి



పాల్గొన్న గౌడ సంఘం నాయకులు

దహెగాం: మండలంలోని హత్తిని గ్రామంలో మంగళవారం సర్వాయి పాపన్న వర్ధంతిని మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు కోండ్ర తిరుపతిగౌడ్, రాజాగౌడ్, గంగాధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకపఠనం ఎంతో అవసరం



పుస్తక పఠనం ప్రాముఖ్యత వివరిస్తున్న హెచ్ఎం

రెబ్బెన: విద్యార్థులు ఉన్నత భవిష్యత్తుకు పుస్తక పఠనం ఎంతో అవసరమని పులికుంట కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన అంతర్జాతీయ బాలల పఠన దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు పుస్తక పఠన ఆవశ్యకత, పుస్తకాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో రూం టూ రీడ్ సంస్థ మండల ఇన్‌చార్జి శ్రీనివాస చారి పాల్గొన్నారు.

పంచలోహ నవగ్రహ విగ్రహాల అందజేత



పంచలోహ విగ్రహాలు అందజేస్తున్న దంపతులు

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయానికి మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్ దంపతులు మంగళవారం పంచలోహ నవగ్రహ విగ్రహాలను అందజేశారు. ఆలయ అర్చకులు శిరీష్‌శర్మ నవగ్రహ విగ్రహాలకు అభిషేకం, పుష్పార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వివేక్, జీవన్, రమేశ్, నారాయణమూర్తి, యాదగిరి, శ్రీనివాస్, మధు, భూమేందర్, భక్తులు పాల్గొన్నారు.

బాబా చూపిన మార్గంలో నడవాలి



చిత్రపటానికి పూజలు చేస్తున్న భక్తులు

కెరమెరి: శ్రీ సద్గురు పూలాజీబాబా చూపిన మార్గంలో నడవాలని పట్నాపూర్ ముఖ్య సంస్థాన్ అధ్యక్షుడు కేశవ్ ఇంగ్లే అన్నారు. మంగళవారం మండలంలోని కెస్లాగూడలో శ్రీ సద్గురు పూలాజీ బాబా ధ్యాన మందిర 22వ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. బాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భక్తులు భగవంత్‌రావు, శ్యాంరావు, నారాయణ, జలపతిరావు, బాపూరావు, సోమ, సకారాం తదితరులు ఉన్నారు.

పశువుల కొట్టం దగ్ధం

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి గ్రామానికి చెందిన చౌదరి పెంటయ్య పశువుల కొట్టం మంగళవారం విద్యుదాఘాతంతో దగ్ధమైంది. ఇంటికి ఆనుకొన్ని ఉన్న కొట్టంలో విద్యుత్ వైర్లు కాలిపోయి మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు విద్యుత్ ప్రవాహాన్ని నిలిపివేసి మంటలు ఆర్పివేశారు. కొట్టంలోని వ్యవసాయ పరికరాలు, సామగ్రి కాలిపోయినట్లు బాధితుడు వాపోయాడు.

సమస్యలతో సహవాసం

- ఇబ్బందులు పడుతున్న శంకర్‌లొద్ది గ్రామస్తులు
- కంకర తేలిన రోడ్డు
- కనీస సౌకర్యాలు కరువు



శంకర్‌లొద్ది గ్రామం



కంకర తేలి నడిచేందుకు యోగ్యంగా లేని దారి



దారి మధ్యలో కల్వర్టు

కెరమెరి: మండలంలోని శంకర్‌లొద్ది గ్రామం అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచింది. కనీస సౌకర్యాలు లేక గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో 50 కుటుంబాలు, 256 మంది జనాభా నివసిస్తున్నారు. మండల కేంద్రం నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు సౌకర్యం కూడా లేదు. కరంజివాడ గ్రామం వరకు బీటీ రోడ్డు ఉన్నా ఆ తర్వాత ఆరు కిలోమీటర్లు పూర్తిగా కచ్చా రోడ్డు ఉంది. గ్రామానికి వెళ్లే దారి మధ్యలో కొండ ఉండడంతో వాహనాలు ఎక్కేందుకు మొరాస్తున్నాయి. దారి మొత్తం కంకర తేలి ఉండడంతో గ్రామస్తులు ప్రయాణం చేసేందుకు అవస్థలు పడుతున్నారు.

బడి, గుడి లేదు..

గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం పాఠశాల ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు మహారాష్ట్ర ఏర్పాటు చేసిన పాఠశాలకు వెళ్తున్నారు. గతంలో ఓ ఇంట్లో పాఠాలు బోధించేవారు. కానీ విద్యార్థులు ఎక్కువగా మహారాష్ట్ర పాఠశాలకు వెళ్లేందుకు మొగ్గుచూపేవారు. అయితే ప్రస్తుతం మారిన పరిణామాల దృష్ట్యా అక్కడి విద్యార్థులు తెలుగులో పాఠాలు నేర్చుకునేందుకు ఇష్టపడుతున్నారు. కాని బడి లేకపోవడంతో సాధ్యం కావడం లేదు. గ్రామస్తులు రేషన్ సరుకుల కోసం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న పరంధోళి గ్రామానికి వెళ్లాల్సిందే. అధికారులు స్పందించి వెంటనే గ్రామంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలి



ఏళ్ల కాలం నుంచి బీటీ రోడ్డు నిర్మించాలని అధికారులను వేడుకుంటున్నాం. అయినా ఎలాంటి స్పందన లేదు. కంకర తేలడంతో దారి వెంట నడిచేందుకు కూడా వీలే లేకుండా ఉంది **- కాంబ్లె మధుకర్, శంకర్‌లొద్ది**

నిత్యావసరాలకు ఇబ్బందే



నిత్యావసర సరుకులు రేషన్ షాపు నుంచి తీసుకు రావాలంటే చాలా ఇబ్బందిగా మారింది. రేషన్ సరుకులు ఇక్కడే ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. **- సుశీలబాయి, శంకర్‌లొద్ది**

రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



పేషెంట్‌తో మాట్లాడుతున్న వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: ప్రభుత్వాసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిని డీఎంహెచ్‌వో తుకారాం, డీసీహెచ్ చెన్నకేశవతో కలిసి ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రి రికార్డులు, హాజరు రిజిస్టర్లు, మందుల నిల్వలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల మానవత్వం కలిగి, వైద్య సేవలందించాలన్నారు. రోగులకు అందుబాటులో ఉండాలని, ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని పేర్కొన్నారు. ఆసుపత్రిలో ఓఆర్ఎస్, గ్లూకోజ్‌తో పాటు అవసరమున్న మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, రిజిస్టర్‌లో ఎప్పటికప్పుడు వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. ఆసుపత్రిలో నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణాన్ని పరిశీలించి, నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. అనంతరం డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ నాగార్జున చారి, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి

కాగజ్‌నగర్‌రూరల్: వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్షణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. క్లైయిమేట్ చేంజ్ హ్యూమన్ హెల్త్ ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం మండలంలోని ఈజ్‌గాం పీహెచ్‌సీని సందర్శించారు. వైద్యాధికారులు, ఆశవర్కర్లతో సమావేశమయ్యారు. వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఎంహెచ్‌వో తుకారాం, డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో భీమ్‌దీక్ష యాత్ర



కౌటాల: బైక్ ర్యాలీ తీస్తున్న దీక్షాపరులు

కౌటాల: మండల కేంద్రంలోని బుద్ధ విహార్ నుంచి మొగడ్‌దగడ్, బాలేపల్లి, వీర్దండి, గుండాయిపేట్, తుమ్మిడిహెట్టి గ్రామాల్లో మంగళవారం భీమ్ దీక్షాపరులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని భారత రాజ్యాంగ అవగాహన సదస్సులో భాగంగా భీమ్ దీక్షయాత్రను రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బౌద్ధ సమాజ్ సంఘం సిర్పూర్ తాలుకా అధ్యక్షుడు బసర్కార్ విశ్వనాథ్, మహర్ సంఘం నాయకులు బండురావు, అశోక్, కిశోర్, పత్రు, నిరంజన్, విఠల్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూర్: రాజ్యాంగంపై అవగాహన కల్పించేందుకు చేపట్టిన భీం దీక్షాయాత్ర మంగళవారం బెజ్జూర్ మండలానికి చేరుకుంది. అంబేద్కర్ సంఘం సిర్పూర్ తాలూకా అధ్యక్షుడు బసర్కార్ విశ్వనాథ్ మాట్లాడుతూ యాత్ర ద్వారా రాజ్యాంగంపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. బుధవారం దహెగాం, కాగజ్‌నగర్, సిర్పూర్ మండలాల్లో పర్యటించి కౌటాల మండల కేంద్రానికి చేరుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భీం దీక్షా యాత్రికులు పూజ్య బంతేజీ శీల్ రత్న, దాగాం పత్రు, బసర్కార్ అశోక్, దుర్గం కిషోర్, దుర్గం శ్యాంరావు, ఆయా గ్రామాల ఉపాసకులు పాల్గొన్నారు.

హాస్టల్ వర్కర్ల వేతనాలు పెంచాలి

ఆసిఫాబాద్అర్బన్: జిల్లాలోని పోస్ట్‌మెట్రిక్ బాలుర పాఠశాలలు, తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాల్లో పని చేస్తున్న దినసరి, ఔట్‌సోర్సింగ్ వర్కర్ల వేతనాలు పెంచాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హాస్టళ్లలో పని చేసే కార్మికులకు చాలీచాలని వేతనాలు చెల్లిస్తూ ప్రభుత్వం వారి పొట్టగొడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు కృష్ణమాచారి, శ్రీనివాస్, కోటయ్య, లక్ష్మణ్, వసంత్, మౌనిక, ఛాయ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న చంద్రయ్య

లింగాపూర్: మండలకేంద్రంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం జిల్లా డీఆర్‌డీవో ఏపీవో చంద్రయ్య పరిశీలించారు. పని ప్రదేశాల వద్ద పాల్గొనే కూలీలకు అన్ని రకాల వసతులను ఏర్పాటు చేయాలని మండల ఏపీవో, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు పలు సూచనలు చేశారు. కూలీలు ఎండలు తీవ్రంగా ఉన్న కారణంగా ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు ముగించాలన్నారు. రైతులకు ఉపయోగపడే పనులను చేపట్టాలన్నారు. లింగాపూర్ ఏపీవో రామకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ రామకృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్ సంజీవ్ పాల్గొన్నారు.

కౌటాల: ఉపాధిహామీ పని ప్రదేశాల్లో కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని డీఆర్‌డీవో, మండల ప్రత్యేకాధికారి సురేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవి ఎండలు మండుతుండడంతో పని ప్రదేశాల్లో తాగునీరు, నీడ కోసం టెంట్లను, ఓఆర్ఎస్ ప్యాకెట్లను, ప్రాథమిక చికిత్స కిట్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. వడదెబ్బపై రైతులు, ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం కౌటాల గ్రామపంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించి గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట కార్యదర్శి సాయికృష్ణ, తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కెరమెరి: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఎస్ఈ వాసుదేవ్ ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మార్చి నూతన పీటీఆర్(పవర్ ట్రాన్స్‌ఫార్మర్)ను బిగిస్తున్నందును విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

'ఉద్యోగ విరమణ అనివార్యం'



సన్మానిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్అర్బన్: ప్రభుత్వ శాఖలో పని చేస్తున్న ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ అనివార్యమని, జిల్లా ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో ఏఆర్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఎస్‌కే అహ్మద్, హోంగార్డు సాజిద్‌లు ఉద్యోగ విరమణ సందర్భంగా వారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావ్, డీఎస్పీలు సదయ్య, కరుణాకర్, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓసీపీ అధికారులకు సన్మానం



సత్యనారాయణను సన్మానిస్తున్న నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీ గడిచిన ఆర్థిక సంవత్సరంలో అత్యధిక బొగ్గు ఉత్పత్తి సాధించడంతో మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఓసీపీ అధికారులను ఘనంగా సన్మానించారు. ఖైరిగూడ ఓసీపీ ప్రాజెక్టు అధికారి సత్యనారాయణతో పాటు మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్‌లను ఏఐటీయూసీ నాయకులు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి మాట్లాడుతూ కొన్నేళ్లుగా వార్షిక ఉత్పత్తి సాధనలో బెల్లంపల్లి ఏ రియా వెనకంజలో ఉండగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో అత్యధిక ఉత్పత్తి సాధించిన ఏరియాగా నిలిచిందన్నారు. ఫిట్ కార్యదర్శి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు కిరణ్‌బాబు, దివాకర్, రిలే ఇన్‌చార్జి రాజయ్య మల్లేశ్, రాజశేఖర్, నరేశ్, వినోద్, రవి, ఓదెలు, రమేశ్, ధర్మయ్య, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

తనిఖీల్లో నగదు స్వాధీనం

జైనూర్: మండలంలోని ఉశేగాం శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఉట్నూర్ నుంచి జైనూర్ వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న విజయకుమారి అనే మహిళ వద్ద రూ.7లక్షల 31వేల 350లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ అంజయ్య తెలిపారు.

'భూ కబ్జా చేసేందుకు దౌర్జన్యం'

చింతలమానెపల్లి: తమ భూమిని కబ్జా చేసేందుకు కొందరు తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామానికి చెందిన కామ్రె పాపయ్య అలియాస్ ప్రేమ్ కుమార్, అమ్మక్కలు ఆరోపించారు. మంగళవారం విలేకరులతో వారు మాట్లాడుతూ తమ కుటుంబసభ్యులకు చెందిన 18 ఎకరాల భూమిపై గత రెండు నెలలుగా కౌటాల మండలం యాపలగూడ గ్రామానికి చెందిన కామ్రె శంకరయ్య, కామ్రె సూర్యదాస్‌లు వివాదం సృష్టిస్తున్నారన్నారు. అనుచరులతో వచ్చి తమపై దాడి చేసేందుకు ప్రయత్నించారని వాపోయారు. భూమిపై 2020లోనే కోర్టులో కేసు వేశారని తమ వద్ద ఉన్న ఆధారాలను కోర్టుకు సమర్పించినట్లు బాధితులు తెలిపారు. కేసు కోర్టులో ఉన్నప్పటికీ దౌర్జన్యంగా తమ భూమిలోకి వస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

వేసవి కాలంలో వ్యాధులపై అవగాహన

జైనూర్: వడదెబ్బ వలన కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి జితేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఉశేగాం ప్రభుత్వాసుపత్రిలో ఆశా కార్యకర్తల దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

'నిస్వార్థ సేవకుడి'కి నిజమైన గుర్తింపు

- సామాజిక, ఆధ్యాత్మిక సేవారంగంలో నంది పురస్కారం
- మన్ననలు పొందుతున్న ఆలయ పూజారి వినోద్



నంది పురస్కారంతో దేవార వినోద్

రెబ్బెన: సామాజిక సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో అందరి మన్ననలు పొందుతున్న మండలంలోని ఇందిరానగర్‌కు చెందిన ఆలయ పూజారి దేవార వినోద్‌కు అరుదైన పురస్కారం వరించింది. ఎనిమిదేళ్లుగా ఆయన అందిస్తున్న నిస్వార్థ సేవలను గుర్తించిన శిఖర ఆర్ట్స్ అనే సంస్థ హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సామాజిక సేవా, ఆధ్యాత్మిక రంగం నుంచి నంది పురస్కారం అందించింది. ఇందిరానగర్‌లో గల కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయంలో ప్రధాన పూజారిగా పని చేస్తున్న దేవార వినోద్ అతి చిన్న వయస్సులోనే ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కరోనా సమయంలో జిల్లాలోని గిరిజన గ్రామాల్లో నిరుపేద కుటుంబాలకు, జర్నలిస్టులకు నిత్యావసర సరుకులు అందించారు. ప్రభుత్వ ఆసుపత్రిల్లో గర్భిణులకు, మహిళలకు పౌష్టికాహారం, మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో వేసవిలో అంబలి పంపిణీ, అగ్ని ప్రమాదాల్లో ఇళ్లు కాలిపోయిన బాధితులకు నిత్యావసర సరుకులు, వంటసామగ్రి, బట్టలు అందించి అండగా నిలిచారు. వైద్య శిబిరాలు ఏర్పాటు, నిరుపేద వృద్ధులకు దుప్పట్లు, యువకులకు క్రీడా సామగ్రి, నిరుపేద కుటుంబాలకు చెందిన జంటలకు మంగళసూత్రాలు, బట్టలు, వంట సామగ్రి పంపిణీ, తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు ఆర్థిక సాయం వంటి ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. దేవార వినోద్ చేస్తున్న అనేక సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి ప్రభుత్వంతో పాటు, వివిధ సంస్థలు అనేక అవార్డులు అందించాయి. గ్రామాల్లో నిరుపేదల పెళ్లికి పుస్తెమట్టెలు, ఆర్థిక సాయం అందించినందుకు అప్పటి కలెక్టర్ రాహుల్‌రాజ్ చేతుల మీదుగా 2023 ఉత్తమసేవా పురస్కార్ అవార్డు సైతం అందుకున్నారు.

చౌపన్‌గూడలో ఎయిడ్స్‌పై అవగాహన

కెరమెరి: మండలంలోని చౌపన్‌గూడ గ్రామంలో మంగళవారం శ్రీ చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో గ్రామీణులకు, యువకులకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. యువజన సంఘం మండలాధ్యక్షుడు పంద్రం వసంత్‌రావు మాట్లాడుతూ ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామ పటేల్ ఆత్రం బొజ్జిరావు, జంగు, జగన్, తుకారాం, సాగర్ తదితరులు ఉన్నారు.

ఎన్నికల నియమాలు పాటించాలి



కవాతు చేస్తున్న పోలీసులు

చింతలమానెపల్లి: ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమాలు పాటించాలని సీఐ సాదిక్ పాషా అన్నారు. మంగళవారం మండలంలోని చింతలమానెపల్లి, బాలాజీఅనుకోడ, రవీంద్రనగర్1లలో సీఆర్పీఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. మండలంలోని ఖర్జెల్లిలో నిర్బంధ తనిఖీలు నిర్వహించి ప్రజలతో మాట్లాడారు. రవీంద్రనగర్1లో నిర్వహించిన తనిఖీల్లో ఒక దుకాణంలో 3.86 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని, బైద్య సమరేశ్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై నరేశ్, సీఆర్పీఎఫ్, ప్రత్యేక పోలీసు బలగాల సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం



దహెగాం: లగ్గాంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సహకార సంఘం అధికారులు

బెజ్జూర్: మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంతోష్, సీనియర్ అసిస్టెంట్ అచ్యుత రావుతో కలిసి మంగళవారం ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో సీఈవో వెంకటేశ్వర్ గౌడ్, సెంటర్ ఇన్‌చార్జి సంజీవ్ కుమార్, సిబ్బంది దేవాజీ, రైతులు పాల్గొన్నారు.

దహెగాం: మండలంలోని లగ్గాం, ఒడ్డుగూడ, గిరవెల్లి గ్రామాల్లో మంగళవారం సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ సీఈవో బక్కయ్య మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించడం ద్వారా గిటుబాటు ధర లభిస్తుందన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని సూచించారు.

పెంచికల్‌పేట్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పెంచికల్‌పేట్ ఇన్‌చార్జి ఏడీఏ రాజులనాయుడు అన్నారు. మండలంలోని ఎల్లూర్, కొండపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. పీఏసీఎస్ సీఈవో వెంకటేశ్వర్‌గౌడ్, ఆర్ఐ గోపాల్, సిబ్బంది పర్శ సంజీవ్, రైతులు పాల్గొన్నారు.

కౌటాల: మండలంలోని రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని సహకార సంఘం సీఈవో రాజేశ్ అన్నారు. గురుడుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని వీరవెల్లి, కుంబారీ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఏఈవోలు శ్రీకన్య, దుర్గ భవాని, సిబ్బంది గురుదాస్, కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఓంకార ఆశ్రమంలో ఉత్సవాలు ప్రారంభం



రాధాకృష్ణుల పల్లకి ఊరేగిస్తున్న భక్తులు



యజ్ఞ క్రతువు ప్రారంభిస్తున్న పండితులు

చింతలమానెపల్లి: ఖర్జెల్లి ఓంకార ఆశ్రమంలో మంగళవారం రాధాకృష్ణుల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను ప్రారంభించారు. ఉదయం శాస్త్రోక్తంగా వేద పండితులు పూజలు నిర్వహించి కార్యక్రమాలు ప్రారంభించారు. ఆశ్రమంలో శ్రీ విష్ణు సేవానందగిరి స్వామి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. ఉత్సవాలలో భాగంగా యాగశాలలో యజ్ఞ, హోమాలు నిర్వహించారు. అనంతరం శ్రీ రాధాకృష్ణుల విగ్రహాలను పల్లకిలో ఊరేగించారు. బుధవారం మహాలక్ష్మి కుంకుమార్చన, భక్తి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.